క్లుప్తంగా

అయ్యప్ప గ్రామోత్సవం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో సోమవారం రాత్రి మాలధారులు, భక్తులు అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌లో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అయ్యప్పకు పూజలు చేయించగా, భక్తులు కలశాలతో ముందుకు నడిచారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి అయ్యప్ప స్వామి భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మల్లు పెద్ద వెంకటసుబ్బారెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ

రాజంపేట రూరల్ : పట్టణ శివారులలో ఉన్న కూచివారిపల్లిలోని దగ్గుపాటి బాలాజీనాయుడు గృహంలో సోమవారం రాత్రి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో భాగంగా విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పల విగ్రహాలను అలంకరించి ప్రత్యేక మండపాలలో కొలువుదీర్చారు. స్వామి వార్లకు, పడిమెట్లకు గురుస్వామి సత్యస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

రామాపురం : మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేస్తామని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో గస్తీ ఏర్పాటు చేశామని, గ్రామాలలో సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. వాహనదారులు భద్రతా సూత్రాలను పాటించాలని తెలియజేశారు. సమావేశంలో ఎస్‌ఐ కొండారెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్‌శర్మ, మండల పోలీసులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చల్లా రామకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి చల్లా రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పరామర్శ

పుల్లంపేట : వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ పరామర్శించారు. అప్పారాజుపేట గ్రామంలోని ముస్తాక్ నివాసానికి వెళ్లిన కొరముట్ల శ్రీనివాసులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి ధ్వజారెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులు కె.నాగరాజు, బి.రవి నాయక్‌లను మంగళవారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు ఫిజిక్స్ అధ్యాపకులుగా, రవి నాయక్ ఆంగ్ల అధ్యాపకులుగా పదోన్నతి పొందడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. వీరు పదోన్నతి పొందిన పాఠశాలలో కూడా మంచి పేరు పొంది ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పందిర్లు తొలగించండి

రాయచోటి టౌన్ : రాయచోటి స్టాంప్ రైటర్లు పోస్టాఫీస్ స్థలానికి ఎదురుగా ఉన్న ఖాళీ జాగాలో గత కొన్ని రోజుల నుంచి తాత్కాలిక పందిర్లు వేసుకొని స్టాంప్ రైటర్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాయచోటి పోస్టాఫీస్ అధికారులు సబ్ పోస్టు మాస్టర్ బి.రమణ నాయక్ తన సిబ్బందితో వచ్చి వెంటనే పందిర్లు తొలగించాలని చెప్పారు. భవనాలు నిర్మించడానికి నిధులు కూడా వచ్చాయని త్వరలో ఇక్కడ నిర్మాణాలు చేపట్టడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అక్కడే స్టాంప్ రైటర్ల సంఘం నాయకులు వచ్చి తాత్కాలికంగా వేసుకున్నామని మీరు కోరితే ఎప్పుడు కోరితే అప్పుడు తొలగిస్తామని తెలియజేశారు. త్వరలో మాకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఒక స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారని అప్పటి వరకు ఇక్కడ ఉంటామని చెప్పారు. ఉన్నతాధికారులు అనుమతిస్తే ఏర్పాటు చేసుకోవచ్చని రమణ నాయక్ వారికి సూచించారు.

రూ.15 లక్షలు వితరణ

రాజంపేట రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన భువనగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి టీడీపీ నాయకుడు గంటా నరహరి రూ.15 లక్షలు వితరణ చేశారు. మండల పరిధిలోని భువనగిరిపల్లి వద్ద నున్న నరసింహ స్వామి దేవాలయ ఆవరణలో గంటా ఫౌండేషన్ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం దేవాలయ కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

భూ పంపిణీతో పేదలకు శాశ్వత ప్రయోజనం

- భూమిలేని నిరుపేదలకు భూ హక్కును కల్పించిన జగన్ ప్రభుత్వం
- లక్కిరెడ్డిపల్లె, రామాపురంలలో భూ పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: భూ పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఆర్.నారాయణ మూర్తి

లక్కిరెడ్డిపల్లె : భూమి లేని నిరుపేదలకు భూ హక్కు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భూ పట్టాలు పంపిణీ చేసిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన లక్కిరెడ్డిపల్లె మండలానికి సంబంధించి భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో సినీ నటుడు, దర్శకుడు, రచయిత ఆర్.నారాయణ మూర్తి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ, భూములపై సర్వహక్కులు కల్పిస్తూ భూమిలేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు ఇప్పటికే అసైన్డ్, గ్రామ సర్వీస్ ఇనామ్, ఎస్సీ కార్పొరేషన్(ఎల్‌పీఎస్) భూములు పొందిన వారికి వాటిపై సర్వహక్కులు కల్పిస్తూ భూ యజమాన్య హక్కు పత్రాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ల చరిత్రలో 30 లక్షల ఎకరాల పేదల భూములకు హక్కులు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. నాడు వైఎస్సార్ హయాంలో, నేడు వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే భూ పంపిణీ జరుగుతోందన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో అసైన్‌మెంట్ పట్టాలకు సంబంధించి 249 మంది లబ్ధిదారులకు 374.11 ఎకరాలు, కుమ్మరి, మంగళి, మాదిగ తదితర ఇనాం భూములకు సంబంధించి 344 మంది లబ్ధిదారులకు 406.25 ఎకరాలను పట్టాలుగా ఇవ్వడం జరుగుతోందన్నారు. త్వరలో అసైన్‌మెంట్ రెగ్యులైజేన్ ద్వారా లక్కిరెడ్డిపల్లె మండలంలోని 9 వర్తించిన గ్రామాలలో 3431 మంది లబ్ధిదారులకు 5409.34 ఎకరాలను పట్టాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ పేదలను భూస్వాములను చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. పులివెందుల తరహాలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అభివృద్ధి చేస్తుండడం హర్షనీయమన్నారు. అనంతరం ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా.. అంటూ పాటపాడి ఆర్ నారాయణ మూర్తి సభకు హాజరైన ప్రజలను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, మండల ఉపాధ్యక్షుడు సమర సింహారెడ్డి, సుబ్బరాయుడు, రవిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ లక్ష్మీ నారాయణ, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, బాబు, రమణయ్య, సిద్దక, నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, జగన్ మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, ఉప సర్పంచ్ రాజా రెడ్డి, సంజీవరెడ్డి, మైనార్టీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ముఖాలలో చిరునవ్వు చూడాలన్నదే ధ్యేయం

రామాపురం : ఏళ్ల తరబడి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం చేకూర్చే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండలానికి సంబంబధించిన అసైన్‌మెంట్ భూముల పట్టాల పంపిణీలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తొలివిడతగా 189 పట్టాదారులకు గాను 329.12 ఎకరాలు విస్తీర్ణపు భూములకు పట్టాలు అందజేస్తున్నారన్నారు. ఇనాం భూములకు సంబంధించి 308 మంది పట్టాదారులకు 296.30 విస్తీర్ణాన్ని రైతులకు పట్టాలుగా ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు భూ పంపిణీపై చొరవ చూపలేదన్నారు. పేదల ఆర్థిక ఎదుగుదల కోసం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని హక్కులతో ఇస్తున్న భూములను ఎటువంటి పరిస్థితుల్లోను అమ్ముకోరాదని, పట్టాలు పొందువారు అధికారులు, సిబ్బంది, దళారులకు లంచాలు ఇవ్వనవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై శిక్షణ

సంబేపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై మంగళవారం తహసీల్దార్ మహేశ్వరీబాయ్, ఎంపీడీఓ నరసింహులు ఆధ్వర్యంలో కులగణనపై శిక్షణా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి కులగణనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి ఇంటికి వెళ్లి కులగణన చేపట్టాలని ఆదేశించారన్నారు. వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకే హెల్త్ కార్డులు

చిట్వేలి : పశువులను రోగాల బారి నుంచి సంరక్షించేందుకు అనిమల్ హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు కేడీ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మైలపల్లి ఆర్‌బీకే పరిధిలోని ఎం.రాచపల్లి, ఎస్టీ కాలనీ, వైఎస్ రాజారెడ్డి ఎస్టీ కాలనీ, మైలపల్లి అరుంధతివాడలలో అనిమల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్టు ఆయన చెప్పారు. అనంతరం పశువులు, గొర్రెలు, మేకలకు వివిధ వ్యాధులకు నివారణ నిమిత్తం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ నాయక్, గోపాలమిత్రలు వెంకటసుబ్బయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యాలయాలు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

నందలూరు (రాజంపేట) : గ్రామాలకు పరిపాలన చేరువ చేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లేబాక గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సిబ్బందిని ఆ గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లు సీఎం జగన్ ఏర్పాటు చేయించారన్నారు. ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటూ వారికి కష్టాలు తీరుస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర మూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ భువనబోయిన లక్ష్మీనరసయ్య, జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, రాష్ట్ర యువజన కార్యదర్శి నడిపీడి సుధాకర్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లె మాధవి, మండల జేసీఎస్ కన్వీనర్ కలీం, మైనార్టీ నాయకులు షావల్లీ, పఠాన్ మస్తాన్ ఖాన్, ఆర్ముగం విశ్వనాథ్, ఓర్సు శ్రీనివాసులు, మోదుగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రాజంపేట టౌన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సీపీ బ్రౌన్ గ్రంథాలయం డైరెక్టర్, ప్రొఫెసర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రభుత్వ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పూర్వం గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు ఎంతో శ్రమించాల్సి వచ్చేదన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం, లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్ శివలక్ష్మి, లైబ్రరీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బి.ఆదినారాయణరెడ్డి, పీడీ మేజర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని సర్పంచ్ అంచల రామచంద్ర అన్నారు. మంగళవారం సంబేపల్లెలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి సర్పంచ్ హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు, చిత్రలేఖన పోటీలను నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

చదువుతో పాటు సత్ప్రవర్తన అవసరం

వీరబల్లె (రాయచోటి టౌన్) : విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘురామయ్య అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ మార్కులు సాధించడానికి ఉపాధ్యాయుల పాత్ర ఎంత ఉంటుందో తల్లిదండ్రులది కూడా అంతే ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన చాలా అవసరమన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యాబోధన సాగుతోందని ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్‌లను డీఎస్సీ ద్వారానే భర్తీ చేయండి

రాయచోటి అర్బన్ : ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారానే భర్తీ చేయాలని అన్నమయ్య జిల్లా ఏబీవీపీ కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి డీఆర్‌ఓ సత్యనారాయణకు విన్నవించారు. మంగళవారం ఏబీవీపీ విద్యార్థులు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓను కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గతనెలలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రైవేటు యాజమాన్యాలు పత్రికా ప్రకటన ఇవ్వడం దారుణమన్నారు. ఎయిడ్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ముడుపులు కట్టబెడుతూ తమ బంధువులు, స్నేహితులకు ఉపాధ్యాయ పోస్టులను కట్టబెడుతూ సొమ్ము చేసుకుంటున్నారంటూ ఆరోపించారు. ఈ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఈమేరకు డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఏబీవీపీ నేతలు ప్రశాంత్, విజయ్, శ్రీవాస్తవ్, షాజహాన్, మాధవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గాలివీడు : మండల పరిధి వెలిగల్లు గ్రామం ఇందుకూరువాండ్లపల్లె గుట్టలలో పేకాట ఆడుతున్న 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.21వేలు నగదును ఎస్‌ఐ వెంకటశివకుమార్ మంగళవారం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హామీలను అమలు చేయాలి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న దళిత, గిరిజన, బలహీన వర్గాల వారికి సీఎం జగనన్న అండగా ఉండాలని కోరారు. నిరసనలో సీహెచ్ ఓబయ్య, టి.తిరుపాలు, కె.తిరుపాలు, మధు, ప్రసాద్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీ కొన్న కారు

రామాపురం : మండల పరిధి కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని నీలకంఠ్రావుపేట క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి ఆగి ఉన్న టిప్పర్‌ను కారు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. గాయపడిన ఇద్దరు వీరబల్లికి చెందిన జాఫర్, మస్తాన్‌లుగా గుర్తించారు. చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్రేతేశ్వరుడికి గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరుడికి కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో పదుల సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. సాయంత్రం 6 గంటలకు గిరి ప్రదక్షిణను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చారు. స్వామి వారి పల్లకీని భక్తులు మోస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

సిద్దవటం : జగనన్న గృహనిర్మాణ పథకం లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలానికి జగనన్న గృహ నిర్మాణాల పథకం కింద 1084 గృహాలు మంజూరయ్యాయన్నారు. అందులో 582 గృహాలు పూర్తి కాగా, 80 నిర్మాణాలకు మినహాయింపు ఉండగా, మరో 499 నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. ఇందులో 84 బిబిఎల్, 249 ఇండ్లు బిఎల్, 143 ఇండ్లు ఆర్‌ఎల్, 22 ఇండ్లు ఆర్సీ దశల్లో ఉన్నాయన్నారు. డిసెంబర్ చివరి నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ తెలియజేశారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆర్టీసీ బస్టాండు



ప్రారంభానికి సిద్ధమవుతున్న ఆర్టీసీ బస్టాండు భవనాలు

రాయచోటి అర్బన్ : రాయచోటి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతనంగా నిర్మించిన 5 అదనపు ప్లాట్‌ఫారాలు, డీఎం కార్యాలయం భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నూతన నిర్మాణాలు ప్రారంభించనున్నారు. రాయచోటి ఆర్టీసీ బస్టాండులో ఇప్పటికే 11 ప్లాట్‌ఫారంలు ఉన్నాయి. రాయచోటి జిల్లా కేంద్రంగా మారడం, జనాభా అవసరాలకు తగు విధంగా బస్టాండులో వసతులు లేవు. దీంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బస్టాండు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి పక్కనే ఉన్న రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలోని స్థలాన్ని ఆర్టీసీకి బదలాయింప చేశారు. బస్టాండు అభివృద్ధి పనులకు సుమారు రూ.2.5 కోట్లు మంజూరు చేయించి పనులు మొదలుపెట్టించారు. కాగా బస్టాండు విస్తరణ పనులకు ఎంతగానో కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

చిన్నమండెం : మండల పరిధిలోని పలు ప్రాంతాలలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. రాయచోటి – మదనపల్లె ప్రధాన రహదారిపై ప్రమాదకర ప్రాంతమైన జల్లావాండ్లపల్లె గ్రామం వద్ద ఇనుప బారికేడ్లను మంగళవారం ఏర్పాటు చేశారు. ఇనుప గేట్స్‌కు రాత్రిపూట మిలుగురు పురుగులాగా వెలుగునిచ్చేటువంటి లైట్లను కూడా ఏర్పాటు చేశారు. గతంలో ఈ ప్రదేశంలో ప్రమాదాలు జరిగి నలుగురు మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే ఈ ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన ఈ ఇనుప బారికేడ్స్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రమాదాల నివారణకు ప్రతిష్ఠ చర్యలు

ఓబులవారిపల్లె : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం మంగంపేట జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా డివైడర్‌లను ఏర్పాటు చేయించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగంపేట ప్రాంతంలో వాహనాల రద్దీ అధికంగా ఉన్న కారణంగా వేగంగా వాహనాలు నడపడంతో పలువురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. ప్రమాదాలు నివారించడానికి డివైడర్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వలి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

రామాపురం : ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగంగా వాహనాలను నడపవద్దని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని, రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు జరిగిన స్థలాలు, వాటి ఫోటోలను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

రాయచోటి అర్బన్ : చదువుకు పేదరికం అడ్డు కాకూడదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. రాయచోటి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 22 మంది పేద విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించలేని దుస్థితిని జరియా ఫౌండేషన్ సభ్యులకు తెలిపారు. స్పందించిన ఫౌండేషన్ సభ్యులు మంగళవారం 22 మంది విద్యార్థినుల పరీక్ష ఫీజు రూ.15,500ల చెక్కును మున్సిపల్ చైర్మన్ చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి జరియా ఫౌండేషన్ సభ్యులు చేయూతనివ్వడం హర్షదాయకం అన్నారు. ఉర్దూ డీఎంఓ మహమ్మద్ హాషిం, వైఎస్ఆర్‌సీపీ నేత రియాజుర్ రహిమాన్, జరియా ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ అలీ, మన్సూర్, కైసర్‌తో పాటు పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

నగరవనం పనులు త్వరగా పూర్తిచేయండి

రాయచోటి అర్బన్ : ప్రజలను ఆహ్లాదరపరిచేందుకు ఉద్దేశించిన నగరవనంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా కోరారు. మున్సిపల్ పరిధిలోని ఎగువ అబ్బవరంలో ఏర్పాటు చేస్తున్న నగరవనంలో మరుగుదొడ్లు నిర్మాణానికి రూ.15లక్షలు మున్సిపల్ అధికారులు మంజూరు చేశారు. మంగళవారం మరుగుదొడ్లు నిర్మాణానికి మున్సిపల్ ఏఈ వెంకట క్రిష్టారెడ్డి మార్కింగ్ ఇచ్చారు. నగరవనంలో మరుగుదొడ్ల పనులను త్వరగా పూర్తిచేయాలంటూ మున్సిపల్ అధికారులను చైర్మన్ కోరారు. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగ మహేశ్వరి, ప్రకాష్, కాంట్రాక్టర్ ఆనందరెడ్డిలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



రాజంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

సిద్దవటం : రాష్ట్రంలోని పేద ప్రజలకు వినూత్నమైన సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా గుర్తింపు తెచ్చుకున్నారని జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మల్లు పెద్ద వెంటసుబ్బారెడ్డి, మల్లు సంజీవరెడ్డి, ఎం.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగంపేట సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయికిషోర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. భరత్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, సుబ్రమణ్యం, అమరేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగపేరూరు గ్రామ సచివాలయం వద్ద రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబుల్‌రెడ్డి, సర్పంచ్‌లు నారాయణరెడ్డి, శివనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, రఘురాంరెడ్డి, ఎంపీటీసీ పిడుగు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే సీఎం జగన్ ఆదర్శం

నందలూరు (రాజంపేట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం లేబాక గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి ఆయన ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మరలా పొందాలంటే జగనన్న మరలా సీఎం కావాలన్నారు. పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వివరించాలన్నారు.

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యం కాగలదని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని రామ్‌నగర్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావు, జేసీఎస్ కన్వీనర్ వడ్డే రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్ సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారావుయాదవ్, రమణ, ఈశ్వరయ్య, శీను, శివ, ధర్మన్న, మిరియం శ్రీను, వెంకటేష్, సింధూరి రాజేష్, శివ, రాజ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి మరల ముఖ్యమంత్రిని చేసుకుందామని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయం-1లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ శేఖర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు తంగాల వేణుగోపాల్, మైనార్టీ నాయకులు నజీరుల్లా ఖాన్, నిజాముద్దీన్, షబ్బీర్, నాగభూషన్‌నాయుడు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని పడమటికోన గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును వైఎస్ఆర్‌సీపీ నాయకులు బాబురెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ప్రభుత్వం మనది అని ప్రతి కుటుంబానికి జగనన్న పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం మళ్లీ వచ్చి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను చేసుకుందామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాధరెడ్డి, క్రిష్ణమ్మ, ఎంపీటీసీ జయమ్మ, పంచాయతీ సెక్రటరీ పవన్‌కుమార్; జేసీఎస్ మండల కనీవనర్ అంజనప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, శేషారెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, రమణ, గంగులయ్య, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే జగనన్న లక్ష్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రజల సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యమని సోమవరం గ్రామ సర్పంచ్ సాయి నేహారెడ్డి అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ విద్యాసంస్థల అధినేత వీఆర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ముకుందపురం నరేష్, ఎంపీడీఓ మల్లీశ్వరి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లె : ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుట్టపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, రవీంద్ర నాయుడులు ఉన్నారు.

డీలర్ల తూనికలు పరిశీలన

పెనగలూరు : మండలంలోని రేషన్ డీలర్ల తూనికలను తూనికల కొలతల అధికారి నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని డీలర్లను తహసీల్దార్ కార్యాలయానికి తూనికలు తీసుకురమ్మని చెప్పి, వాటిని అక్కడే పరిశీలించారు. 50 కేజీల రాళ్లవేసి తూనికలు సక్రమంగా ఉన్నాయో లేదో అని పరిశీలించారు. అనంతరం డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమన్వయంతో సత్ఫలితాలు

నందలూరు (రాజంపేట) : సమన్వయంతో పనిచేస్తే వ్యాధులను పారదోలి మండలానికి మంచి పేరు తీసుకురావచ్చని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ అధ్యక్షతన వైద్యులు కార్తీక్ విశ్వనాథ్, శరత్ కుమార్‌లకు ఆహ్వాన, సృజనలకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు.